

సబ్సిడీ.. సగం బలం

వ్యవసాయానికి యంత్రసాయం

- యంత్రాల కోసం దరఖాస్తుల ఆహ్వానం
- 2025-26 ఆర్థిక సంవత్సరానికి 1.50 కోట్లతో పథకం ప్రారంభం

7

నీళ్లొచ్చినా.. నిష్ఫలం

- స్థానికంగా కురిసిన వర్షాలతోనే నిండిన ఆయకట్టు పరిధి చెరువులు
- నీటి నిల్వ సామర్థ్యం లేకపోవడంతో ఎత్తిపోతల పథకాలు నిలిపివేత
- జూరాల ఆధారంగా ఉన్న ఎత్తిపోతలకు 12 టీఎంసీలు మాత్రమే లిఫ్ట్
- కల్వకుర్తి ఎత్తిపోతల కింద ఇప్పటివరకు 7 టీఎంసీల ఎత్తిపోత
- నీళ్లన్నీ దిగువకు వదిలేసే వేసవిలో కర్ణాటకను అడగాల్సిన పరిస్థితి



జూరాల ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : కృష్ణా బేసిన్‌లో ఈ ఏడాది దాదాపు 780 టీఎంసీల పైచిలుకు నీరు సముద్రంలో కలిసిపోయింది. గడిచిన ఎనిమి దేళ్ల కాలంలో ఒక్క 2023 మినహా ప్రతీఏటా బేసిన్ పరిధిలో సమృద్ధిగానే వర్షాలు కురి శాయి. వేలాది టీఎంసీలు ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా గుండా ప్రవహించి కడలిలో కలిసి పోయాయి. పాలమూరులో కరువుతో వచ్చిన వెనుకబాటుతనాన్ని తీర్చేందుకు రెండు దశా బ్దాల క్రితం చేపట్టిన ప్రాజెక్టులు ఇప్పటికీ అసంపూర్తిగా ఉండటం, పూర్తయిన వాటిలో నీటినిల్వ సామర్థ్యం లేకపోవడంతో వానాకాలం స్థానికంగా కురుస్తున్న వర్షాలతో పంటకాలం పూర్తవుతుండగా యాసంగిలో మాత్రం కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గత ప్రభుత్వం పెండింగ్ ప్రాజెక్టులను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చామని చెప్పుకోగా ప్రస్తుత ప్రభుత్వం గ్రీన్ ఛానల్ ద్వారా నిధులు విడుదల చేసి పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేస్తామని చెబుతోంది. కానీ నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల కింద చిన్నచిన్న పెండింగ్ పనులను పూర్తిచేయడంలో అలసత్వం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఈ ఎత్తిపోతల పథకాలను ప్రధానంగా వేధిస్తున్న సమస్య నీటి నిల్వ సామర్థ్యం. భీమాకు, కోయిల్‌సాగర్‌కు నికర జలాల కేటాయింపులు ఉండగా కల్వకుర్తి, నెట్టెంపాడుకు వరద జలాలే ఆధారం. అయినప్పటికీ కేటాయింపుల్లో సగం జలాలను కూడా వినియోగించుకోవడం లేదు. పెండింగ్ పనులు పూర్తిచేయకపోవడం ఒక కారణం కాగా, వచ్చిన నీటిని ఎత్తిపోసి నీటినిల్వ చేసుకోలేని పరిస్థితులు ఉండటం మరో కారణంగా చెప్పవచ్చు. ఈ పరిస్థితి వల్ల యాసంగి పంటలకే కాకుండా తాగు నీటి అవసరాలకు కూడా కర్ణాటకతో మాట్లాడి నీటిని విడుదల చేసుకోవాల్సి వస్తోంది. 2023-2024లో 1.90 టీఎంసీ, 2024-2025లో 0.94 టీఎంసీలను కర్ణాటకలోని నారాయణపూర్ రిజర్వాయర్ నుంచి విడుదల చేసుకుని తాగునీటి అవసరాలను గట్టెక్కించారు.

స్థానికంగా సమృద్ధి వర్షాలు..

జూరాల ఆధారంగా ఉన్న నెట్టెంపాడు, భీమా 1, 2, కోయిల్‌సాగర్, శ్రీశైలం ఆధారంగా ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలను రన్నింగ్‌లోకి తీసుకువచ్చినప్పటికీ ఆయకట్టు స్థిరీకరణ అనేది జరగలేదు. ప్రత్యేక ఫీడర్ ఛానల్ వ్యవస్థ, డిస్ట్రిబ్యూటరీలు నిర్మించ లేదు. కల్వకుర్తి లిఫ్టు కింద డిస్ట్రిబ్యూటరీలు ఉన్నప్పటికీ వాటికి గొలుసుకట్టు చెరువులనే ఆధారంగా చేసుకున్నారు. ప్రత్యేకంగా పిల్ల కాలువల వ్యవస్థ లేదు. గతంలో వర్షపాతం తక్కువగా ఉండటంతో ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని



కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ఎల్లూరు పంప్‌హౌస్ నుంచి విడుదలవుతున్న నీరు

(మిగతా 7లో..)

పనులు పూర్తయితేనే ఫలితం

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఉన్న ఎత్తిపోతల పథకాలన్నింటికీ నీటినిల్వ సామర్థ్యం లేకపోవడమే కేటాయింపుల మేర వాడుకోకపోవడానికి కారణంగా చెప్పవచ్చు. వరద వచ్చినప్పుడే ఒడిసిపట్టాల్సిన నీటిని మోటార్లు ఆపేయడంతో దిగువకు వెళ్లిపోతున్నాయి. నెట్టెంపాడు కింద ర్యాలంపాడు రిజర్వాయర్ లీకేజీలను అరికట్టడం, ఆఫ్‌లైన్ రిజర్వాయర్లను నింపడంతో పాటు శరవేగంగా గట్టు ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తే కేటాయింపుల మేర నీటి వినియోగం జరుగుతుంది. భీమా లిఫ్ట్-1లో కర్ణాటక ముంపును సామరస్యంగా పరిష్కరించుకొని సంగంబండ పూర్తిగా నింపడం, కొడంగల్- నారాయణపేట ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేస్తే నీటిని సద్వినియోగం చేసుకోవచ్చు. భీమా-2 కింద శంకరసముద్రం ముంపు గ్రామమైన కానాయపల్లివాసుల పరిహార సమస్య తీర్చి ప్రాజెక్టు పూర్తి చేస్తే ప్రయోజనం ఉంటుంది. అలాగే కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద గతంలో ప్రతిపాదించిన ఆన్‌లైన్ రిజర్వాయర్లను యుద్ధప్రాతిపదికన చేపడితే సామర్థ్యం పెరిగి రెండు పంటలకు నీరు అందించుకోవచ్చు.



ఉప ఎన్నికలు వస్తే ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలని సభకు హాజరైన వారికి పిడికిలి బిగించి పిలుపునిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంగ్ కేటీఆర్

- వలసల జిల్లా అభాగ్యులకు అన్నం పెట్టే జిల్లా అయ్యింది
- నేడు గట్టు, తుమ్మిళ్ల ఎత్తిపోతల పనులను మూలకు పెట్టారు
- అభివృద్ధి పేరుతో రేవంత్ సంకలో చేరిన ఎమ్మెల్యే
- రెండేళ్లలో ఎక్కడ డెవలప్‌మెంట్ చేశారో ఆయన చూపించాలి
- ఉప ఎన్నికలు వస్తాయి.. బండ్లను చిత్తుచిత్తుగా ఓడించాలి
- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

పెండింగ్ ప్రాజెక్టులను కేసీఆర్ రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చారు

గద్వాల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): 'బీఆర్ఎస్ ప్రభుత్వంలో పాలమూరులోని పెండింగ్ ప్రాజెక్టులను కేసీఆర్ రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చి, కొత్తగా పది లక్షల ఎకరాలను సాగులోకి తెచ్చాడు. వలసల జిల్లాను రివర్స్ మైగ్రేషన్ జిల్లాగా మార్చడంతో నేడు అభాగ్యులకు అన్నం పెట్టే జిల్లాగా మారింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత గట్టు ఎత్తిపోతల పథకాన్ని మూలన పెట్టారు. తుమ్మిళ్ల ప్రాజెక్టును పూర్తి చేయలేద'ని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గద్వాల గర్జన పేరుతో శనివారం నిర్వహించిన సభకు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధి పేరుతో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సంకలో చేరాడని విమర్శించారు. రెండేళ్లలో గద్వాలలో ఏం అభివృద్ధి చేశాడో వివరించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో గద్వాలకు నర్సింగ్ కాలేజీ, మెడికల్ కాలేజీ, ఆస్పత్రి ఇచ్చామని చెప్పారు. పేదలకు 1,275 ఇళ్లు నిర్మిస్తే వాటికి రంగులు మార్చి మావి అంటూ కాంగ్రెస్ మంత్రులు రిబ్బన్ కట్ చేశారని, వీరికి

(మిగతా 6లో..)

జైలుకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు

- విద్యార్థినులను వేధించిన కేసులో..
- విధుల నుంచి సస్పెండ్ చేసిన డీఈవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన జిల్లా కేంద్రంలోని వీరన్నపేట ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు రమేశ్‌ను శనివారం జిల్లా జైలుకు తరలించారు. అతనిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డీఈవో ప్రవీణ్‌కుమార్ విధుల నుంచి సస్పెన్షన్ చేశారు. అతనిపై పోక్సో కేసు నమోదు కాగా, పోలీసులు అరెస్టు చేసి, కోర్టు ముందు ప్రవేశపెట్టారు. జిల్లా న్యాయాధికారి రిమాండ్ విధించగా, జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ అప్పయ్య తెలిపారు.

విడువని వాన

- నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో 33 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు
- ముసురువానతో పాలమూరులో చిత్తడిగా మారిన రోడ్లు

6

పరిహారం పెంపు చారిత్రాత్మక నిర్ణయం

- సీఎంను కలిసి ధన్యవాదాలు తెలిపిన మంత్రి శ్రీహరి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

నారాయణపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నష్ట పరిహారం ఎకరాకు రూ.14 లక్షల నుంచి రూ.20 లక్షలు పెంచడం చారిత్రాత్మక నిర్ణయమని మంత్రి వాకిటి శ్రీహరి, నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. ఈ మేరకు వారు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్‌రెడ్డితో కలిసి శనివారం ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్‌రెడ్డి కలిసి ధన్యావాదాలు తెలిపారు. సీఎం నిర్ణయం వల్ల నారాయణపేట-కొడంగల్ ప్రాంత రైతులకు మేలు చేకూరుతుందన్నారు. త్వరితగతిన భూసేకరణ చేపట్టి, నష్టపరిహారం అందించి, పనులు వేగవంతానికి చర్యలు తీసుకుంటామని సీఎంకు వివరించారు.



సీఎం రేవంత్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి.. చిత్రంలో శివకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

కోతుల నుంచి రక్షణ కల్పించాలి

- మద్దూరులో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాస్తారోకో
- 15 రోజుల వ్యవధిలో 10 మందిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయని ఆందోళన
- పట్టణ వాసులు ఇళ్ల నుంచి బయటికి వచ్చేందుకు భయపడుతున్నారని ఆవేదన

7

యూరియా కష్టాలు

- కొనసాగుతున్న రైతుల ఆందోళనలు
- కోయిలకొండ, హన్వాడలలో రాస్తారోకో
- నవాబ్‌పేటకు 900 బస్తాలు కేటాయించారని తెలియడంతో తరలొచ్చిన అన్నదాతలు

6

లోక్‌అదాలత్‌లో 21,841 కేసులు పరిష్కారం



కక్షిదారులకు ఇన్సూరెన్స్ అవార్డు అందిస్తున్న ఇన్‌చార్జి న్యాయాధికారి శారదాదేవి

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్‌అదాలత్‌లో 21,841 కేసులను రాజీ మార్గంలో పరిష్కరించారు. శనివారం న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 8 బెంచ్‌లను ఏర్పాటు చేశారు. మహబూబ్‌నగర్ కోర్టులో 6, జడ్చర్ల కోర్టులో 2 బెంచ్‌లను ఏర్పాటు చేయగా, కక్షిదారులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జి న్యాయాధికారి శారదాదేవి లోక్‌అదాలత్‌ను ప్రారంభించి మాట్లాడారు. కేసులు వేసుకోవడం, కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరగడం వల్ల విలువైన సమయంతోపాటు ఆర్థికంగా నష్టపోతారని, అందుకే లోక్‌అదాలత్ ద్వారా కేసులను పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమని తెలిపారు. మోటార్ వెహికిల్ యాక్సిడెంట్ కేసులో కక్షిదారులు రూ.60 లక్షల పరిహారానికి పిటిషన్ దాఖలు చేయగా, ప్రతివాది న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ రాజీ మార్గంలో రూ.18 లక్షలు ఇచ్చేలా పరిష్కరించారు. ఇన్‌చార్జి న్యాయాధికారి శారదాదేవి చేతుల మీదుగా బాధితులకు అవార్డును అందించారు. కార్యక్రమంలో న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి డి.ఇందిర, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి వి.ఈశ్వరయ్య, జూనియర్ సివిల్ న్యాయాధికారి మమతారెడ్డి, నాల్గో అదనపు జూనియర్ న్యాయాధికారి ఎస్‌కే భావన, సెకెండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నిర్మల, అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు అనంతరెడ్డి పాల్గొన్నారు.





విడువని వాన

» కొల్లాపూర్‌లో 90.7 మి.మీ. వర్షం



కొల్లాపూర్ పట్టణంలోని రామాపురం రహదారిలో రోడ్డుపై పారుతున్న వర్షపు నీరు

నాగర్‌కర్నూల్ టౌన్/నారాయణపేట/మహబూబ్‌నగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం రాత్రి, శనివారం సాయంత్రం వరకు వర్షం కురిసింది.

● నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్ మండలంలో 90.7 మిల్లీమీటర్లు, పెద్దకొత్తపల్లి 54.0, లింగాలలో 52.2, కోడేరులో 49.5, బల్మూర్‌లో 43.0, అచ్చంపేటలో 29.4, తెల్కపల్లిలో 23.1 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

● నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో 33 మి.మీ. వర్షపాతం నమోదైంది. నర్వ 15.6, మద్దూర్ 15.5, మక్తల్ 8.5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● మహబూబ్‌నగర్ జిల్లాలో తేలికపాటి వర్షమే కురిసింది. శనివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ముసురువానతో రహదారులన్నీ చిత్తడిగా మారాయి. జిల్లాలోని పలు మండలాలలోనూ తేలికపాటినుంచి మోస్తారు వర్షమే కురిసింది. జిల్లా కేంద్రంలో 5 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● కొల్లాపూర్: డివిజన్ పరిధిలో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రహదారుల వెంట వర్షపు నీరు ఏరులై పారింది. కాలువలు, కుంటలు, చెరువులు నీటితో కళకళలాడాయి. రహదారుల వెంట వర్షపు నీరు పారడంతో వాహనదారులు పాదాచారులు ఇబ్బందులు పడ్డారు. గ్రామాల్లో పురాతన పాత మిద్దెల్లో నివాసం ఉంటున్న వారు తమ బంధువుల ఇళ్లల్లో ఉండాలని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు.

కోర్టు వినూత్న నిర్ణయం

» సామాజిక సేవ రూపంలో శిక్ష అమలు



మద్యం సేవించిన వ్యక్తితో మొక్కలు నాటించి శిక్షను అమలు చేయిస్తున్న అయిజ ఎస్ఐ శ్రీనివాస్

గద్వాల క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోర్టు వినూత్న నిర్ణయం తీసుకొని సామాజిక సేవ రూపంలో శిక్ష అమలు చేసినట్లు జోగుళాంబ గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శిక్ష అంటే కేవలం దండన మాత్రమే కాదని, ప్రజలకు ప్రయోజనం చేకూరేలా ఉండాలని వినూత్నమైన తీర్పును న్యాయాధికారి ఇవ్వగా, ఆ తీర్పును శనివారం అమలు పరిచినట్లు ఎస్పీ తెలిపారు. 2025, మే 7న అయిజలోని టి.జంక్షన్ వద్ద మూగోనిపల్లి గ్రామానికి చెందిన కురువ శ్రీరామ్ మద్యం తాగి మోటార్ సైకిల్‌ను నడుపుతుండగా పట్టబడ్డ విషయంలో పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో శుక్రవారం హాజరుపర్చారు. జుడీషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టు నేరెళ్ల వెంకట హైమాపూజిత కొత్తచట్టాలను అనుసరించి నిందితులకు వినూత్నమైన శిక్షను విధించారు. అందులో భాగంగా శనివారం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటమని శిక్ష విధించడంతో ఈ శిక్షను అయిజ ఎస్ఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అమలు పరిచినట్లు ఎస్పీ తెలిపారు.

కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన నలుగురిపై కేసు నమోదు

జడ్చర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రాఘవేందర్‌రెడ్డి అనే వ్యక్తి జడ్చర్ల మండలం ఈర్లపల్లి గ్రామానికి చెందిన తిరుపతయ్య, లింగమ్మ, లక్ష్మమ్మల పేరుపై ఉన్న 6ఎకరాల 11గుంటల భూమిని కొనుగోలు చేసేందుకు అగ్రిమెంట్‌ను 2015 అక్టోబరు 31న చేసుకున్నాడని సీఐ తెలిపారు. కొనుగోలు దారుడికి భూమి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో రాఘవేందర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించాడని పేర్కొన్నారు. ఆ భూమిపై ఎలాంటి క్రయ, విక్రయాలు జరపకూడదని 2016లో ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చిందని, అనంతరం 2023 సెప్టెంబరు 6న తుది తీర్పుతో రాఘవేందర్‌రెడ్డికి రిజిస్ట్రేషన్ చేయాలని తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ఉల్లంఘించి ఏప్రిల్ 8న మరో వ్యక్తికి సేల్ డీడ్ చేశారని రాఘవేందర్‌రెడ్డి శనివారం ఫిర్యాదు చేశాడని తెలిపారు. భూమిపై ఎలాంటి కేసులు పెండింగ్‌లో లేవని పేర్కొంటూ సేల్ డీడ్ చేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడని తెలిపారు. ఈ మేరకు భూమి విక్రయించిన తిరుపతయ్య, లింగమ్మ, లక్ష్మమ్మలతో పాటు కొనుగోలు చేసిన ఎస్.తిరుపతయ్యపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యువతి జమ్ముల శివ వైష్ణవి (22) ఆచూకీ కన్పించడం లేదని ఆమె తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం... పాలెం గ్రామానికి చెందిన శివ వైష్ణవి జిల్లా కేంద్రంలోని కాకతీయ పాఠశాల సమీపంలో బుక్ స్టోర్ నిర్వహిస్తున్నది. రోజులాగానే షాపునకు వచ్చి షాపు తెరిచి పెట్టి ఫంక్షన్‌కు వెళ్తున్నానని పక్క షాపు వారికి చెప్పి వెళ్లిపోయింది. తండ్రి అనిల్‌కుమార్ వచ్చి చూడగా కన్పించలేదు. పక్క షాపు వారు ఫంక్షన్‌కు వెళ్తుందని తనతో చెప్పి వెళ్లిందని పేర్కొన్నారు. ఈ సంఘటనపై యువతి తండ్రి అనిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైన్స్‌లో చోరీ

మక్తల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా మక్తల్ పట్టణంలోని రాయచూరు రోడ్డులో ఉన్న శాంతమ్మ వైన్స్‌లో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత వైన్స్‌లో రూ.45వేల నగదు, రూ.1.45లక్షల మద్యం సీసాలు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుట్టలు.. గుటకాయస్వాహా

» పథకాల పేరుతో పక్కదారి పడుతున్న ఎర్రమట్టి
» రాత్రింబవళ్లు ఎర్రమట్టి తవ్వకాలు
» అక్రమార్కుల స్వార్థంతో తరుగుతున్న గుట్టలు
» కంటి తుడుపుగా అధికారుల చర్యలు



తనగల గుట్టలో మట్టిని తవ్విన దృశ్యం

వడ్డేపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అక్రమార్కుల స్వార్థంతో ప్రకృతి సిద్ధంగా వెలసిన ఎర్రమట్టి గుట్టలు కరిగిపోతున్నాయి. నాయకుల అండదండలతో పగలు, రాత్రి తేడా లేకుండా ఎర్రమట్టిని ఇష్టానుసారంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. సహజ సిద్ధంగా వెలసిన గుట్టలు అధికారులు, నాయకుల అండదండలతో మాయమైపోతున్నాయి.

వంద ట్రాక్టర్ల మొరానికి అనుమతులు తీసుకుని వెయ్యి ట్రాక్టర్ల దాకా తరలిస్తున్నారు. ఈ విధంగా జిల్లాలో చాలా మండలాల్లో ఎర్రమట్టి మాయమైపోతున్నది. గుట్టలు అక్రమార్కుల స్వార్థంలో కరిగిపోతు న్నాయి.

కొల్లగొడుతున్న అక్రమార్కులు

వడ్డేపల్లి మండలంలోని తనగల శివారులో ఎర్రమట్టి గుట్టలు ఉన్నాయి. ఇక్కడ అనుమతులు లేకుండా క్రషర్ మిషన్లు పెట్టుకుని మొరంను అక్రమార్కులు తరలిస్తున్నారు. స్థానిక నాయకుల అండదండలతో తమ అవసరాల కోసం మొరానికి అనుమతులు ఇస్తున్నారు. ఒక్కొక్క చోట ఒక్కొక్క రేటు నిర్ణయించి ఎర్రమట్టి అమ్ముతూ జేబులు నింపుకుంటున్నారు. ఇదే తరహాలో బుడమొర్సు, వడ్డేపల్లి గుట్టల పరిస్థితి కూడా ఉంది. రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్లు, టిప్పర్లు తిరగడంతో ప్రయాణికులు, ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారకు. ఇదే తరహాలో అలంపూర్ మండలంలోని ర్యాలంపాడు, మానవపాడు మండలంలోని చిన్న, పెద్దపోతులపాడు గ్రామాల్లో కూడా ఎర్రమట్టి పొలాలు ఉన్నాయి. జాతీయ రహదారి నాలుగు లేన్ల విస్తరణలో ఇక్కడ ఉన్న పట్టా పొలాల నుంచి ఎర్రమట్టిని తలరించేవారు. ప్రస్తుతం అలాగేనే ఉన్న ఈ ఎర్రమట్టిని తరలిస్తున్నారు. ఉండవల్లి, అయిజ, ఎర్రవల్లి, ఇటిక్యాల మండలాల్లో ఉన్న భూములోని గుట్టల నుంచి ఎర్రమట్టి తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. జిల్లాలోని ఆయా మండలాల్లో ఉన్న గుట్టల ను, ఎర్రమట్టి భూముల నుంచి మట్టిని కొల్లగొడుతూ అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా అక్రమంగా వ్యాపారం జరుగుతున్నా సంబంధిత అధికారుల్లో చలనం రావడం లేదు. ఇ ప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ అక్రమ వ్యాపారానికి అడ్డుకట్ట వేయాలని ప్రజలు పేర్కొంటున్నారు.

చలనం లేని అధికారులు



అలంపూర్ తాలూకాలో గుట్టల నుంచి ఎర్రమట్టిని తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా కోట్ల రూపాయలు ప్రభుత్వానికి చెల్లించకుండా మెగా ఇంజనీరింగ్ కంపెనీ అక్రమంగా ఎర్రమట్టిని భారత్‌మాల రోడ్డుకి తరలిస్తున్నా అధికారుల్లో చలనం లేదు. ఈ విషయంపై గతంలో కలెక్టర్‌ను స్వయంగా కలిసి ఫిర్యాదు చేశాను. మైనింగ్ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు ఎర్రమట్టిని తరలిస్తున్నా అధికారులు స్పందించక పోవడం విడ్డూరం.

- కాశపోగు రాజు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు

యూరియా కష్టాలు

» అధికారుల హామీతో ఆందోళన విరమణ



కోయిలకొండ చౌరస్తాలో రాస్తారోకో చేస్తున్న రైతులు

నాగర్‌కర్నూల్ టౌన్/ హన్వాడ/ కోయిలకొండ/ నవాబ్‌పేట/ బాలానగర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో రైతులు ఆందోళనకు దిగారు. జిల్లా కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రం, పీఏసీఎస్ వద్ద రైతులకు అధికారులు యూరియా పంపిణీ చేశారు. క్యూలో నిల్చొన రైతులకు యూరియా అందకపోవడంతో అసహనంతో పీఏసీఎస్‌కు ఎదురుగా ప్రధాన రహదారిపై బైఠాయించారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు వచ్చి తమ గోడును వినాలని పట్టుబట్టారు. రైతుల ఆందోళనతో పట్టణంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పోలీసులు అక్కడికి వచ్చి రైతులను వారించే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోవడంతో సంబంధిత అధికారులు అక్కడికి చేరుకుని సోమవారం ఇస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

● ఉదయం 5 గంటలకే రైతులు రోడ్డెక్కారు. యూరియా కావాలంటూ హన్వాడలో తాండూర్-మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై శనివారం ఉదయం రైతులు రాస్తారోకో చేశారు. గంట పాటు రోడ్డుపై బైఠాయించారు. వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. పోలీసులు వారిని శాంతింపచేసినా వినలేదు. చివరికి ఎస్ఐ అక్కడికి వచ్చి ఉన్నతాధికారులతో మాట్లాడి యూరియా వచ్చేవిధంగా చూద్దామని సర్దిచెప్పి పంపించారు.

● కోయిలకొండలో శనివారం రైతులు యూరియా అందించాలని రాస్తారోకో చేశారు. వివేకానంద చౌరస్తా వద్ద వాహనాలు వెళ్లకుండా రోడ్డుపై కూర్చొని రైతులు ఆందోళన చేపట్టారు. లారీలు వస్తున్నాయని పోలీసులు, వ్యవసాయ అధికారులు చెప్పినా రైతులు 2గంటల పాటు రాస్తారోకో నిర్వహించారు. మధ్యాహ్నం 4 లారీలలో యూరియా రావడంతో ఆందోళన విరమించారు. వింజమూరు, చంద్రాసుపల్లి రైతు వేదికల ద్వారా యూరియా అందించాలని ఆ గ్రామాల రైతులు ఆందోళన చేశారు.

● శనివారం సాయంత్రం 900 బస్తాల యూరియా నవాబ్‌పేట మండలానికి కేటాయించినట్లు అధికారులు వాట్సాప్ గ్రూప్‌లలో మెసేజ్‌లు పెట్టడంతో నిమిషాల వ్యవధిలో రైతులు నవాబ్‌పేట, కొల్లూర్ రైతు వేదికల వద్దకు పరుగులు తీశారు. అప్పటికే భారీగా క్యూ ఉండటం చూసి అధికారులు అవాక్కయ్యారు. అధికారులు ముందస్తుగా టోకెన్‌లు అందజేశారు.

● బాలానగర్ మండల కేంద్రంలోని సింగిల్ విడో కార్యాలయం వద్ద శనివారం ఉదయం 6 గంటల నుంచే యూరియా కోసం లైన్‌లో వందలాదిగా నిలబడి బారులు తీరారు. అయినా యూరియా సరఫరా చేయటం లేదని తెలుసుకుని సాయంత్రం వెనుదిరిగారు



నాగర్‌కర్నూల్‌లో ప్రధాన రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు



బాలానగర్‌లో యూరియా కోసం భారీగా బారులుతీరిన రైతులు

పెండింగ్ ప్రాజెక్టులను కేసీఆర్ రన్నింగ్ ప్రాజెక్టులుగా చేశారు

(5వ పేజీ తరువాయి)



సభకు హాజరైన కార్యకర్తలు, నాయకులు

కొంచెమైనా సిగ్గు ఉందా అని ప్రశ్నించారు. తుమ్మిళ్ల ప్రాజెక్టు శంకుస్థాపన చేసి, ఏడాదిలో పూర్తి చేసి నీళ్లు పారించామని అన్నారు. గట్టు ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేసి 40 శాతం పనులను పూర్తి చేశామని, మిగిలిన పనులను, తుమ్మిళ్ల రెండో దశ పనులను కాంగ్రెస్ మూలన పెట్టిందని విమర్శించారు. గద్వాలకు ఏం ముఖం పెట్టుకొని వస్తున్నావని అంటున్నారని, గద్వాలకు లక్ష ఎకరాలకు సాగునీరు అందించామని గుర్తు చేశారు.

నియోజకవర్గ అభివృద్ధి కోసమా.. నీ అభివృద్ధి కోసమా

తలకాయ రైలు కిందపెట్టి చచ్చినా పార్టీ మారనని చెప్పిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అభివృద్ధి పేరుతో కాంగ్రెస్‌లో చేరానని చెప్పడం సిగ్గుచేటని కేటీఆర్ అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమా.. నీ అభివృద్ధి కోసం వెళ్లావా అని నిలదీశారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసిందని చేరావా?, రైతులకు రైతుబంధు రూ.15 వేలు ఇచ్చాడని చేరావా?, ఆడబిడ్డలకు రూ.2,500 ఇచ్చిందని చేరావా అని నిలదీశారు. ఎక్కడైనా రోడ్లు వేయించావా?, అభివృద్ధి చేశావా ? అని అడిగారు. రేవంత్‌రెడ్డి సంకలో చేరిన ఎమ్మెల్యే తాను బీఆర్ఎస్ ఎమ్మెల్యేనే అని అంటున్నాడని, బీఆర్ఎస్ అయితే ఎందుకు పార్టీ మీటింగ్‌లకు రాలేదని ప్రశ్నించారు.

సుప్రీమ్ కోర్టు సీరియస్‌గా ఉందని, తప్పక ఉప ఎన్నికలు వస్తాయని అన్నారు. తల్లిపాలు తాగి రొమ్ము గుద్ది వెళ్లిన ఎమ్మెల్యేను చిత్తుచిత్తుగా ఓడించాలని ఆయన కార్యకర్తలకు సూచించారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతిని రద్దు చేయాలి

స్థానిక సంస్థల ఎన్నికలు వస్తాయని, మునిసిపాలిటీతో పాటు గ్రామాలలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కేటీఆర్ కోరారు. అలంపూర్ నియోజకవర్గంలోని చిన్న ధన్వాడ దగ్గర నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీని రద్దు చేయాలని రైతులు డిమాండ్ చేస్తే వాళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం జైళ్లలో పెట్టిందని విమర్శించారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి ఇచ్చిన అనుమతిని ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాగా కేటీఆర్ సమక్షంలో గద్వాల మునిసిపల్ మాజీ చైర్మన్ బీయస్ కేశవ్‌తో పాటు పదిమంది మాజీ కౌన్సిలర్లు, ధరూర్ జడ్పీటీసీ పద్మావెంకటేశ్వర్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. గద్వాలలో కేటీఆర్‌కు ఘన స్వాగతం లభించింది. కిష్టారెడ్డి బంగ్లా నుంచి తేరు మైదానం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. వర్షంలో కూడా ప్రజలు ఆయన ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీలు చల్లా వెంకట్రామిరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అంజయ్యయాదవ్, జైపాల్‌రెడ్డి పాడి కౌశిక్‌రెడ్డి, ఇంతియాజ్, డాక్టర్ కురువ విజయ్‌కుమార్, డాక్టర్ ఆంజనేయగౌడ్, బాసు హనుమంతు నాయుడు, బాసు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

మామ డైరెక్షన్‌లో : డాక్టర్ ఆంజనేయులు గౌడ్

గద్వాల నియోజకవర్గంలో ఒక ఎపిసోడ్ నడుస్తోందని, మామ డైరెక్షన్‌లో అల్లుడు స్వాతిముత్యం కాగా, అత్త ఆణిముత్యమని డాక్టర్ ఆంజనేయులు గౌడు అన్నారు. మీ రాకతో ఈ ఎపిసోడ్‌కు చరమగీతం పాడాలని చెప్పారు.

కేటీఆర్ రావద్దని కుట్రలు పన్నారు : బాసు హనుమంతునాయుడు

కేటీఆర్ రాకూడదని పది రోజుల నుంచి ఇక్కడ ఎన్నో కుట్రలు పన్నారని బాసు హనుమంతునాయుడు అన్నారు. గద్వాలలో ఎమ్మెల్యే పోతే బీఆర్ఎస్ లేదని చెప్పిన తరుణంలో మళ్లీ ఎన్నికలు వస్తే బీఆర్ఎస్ కు 50 వేల నుంచి 60 వేల ఖాయమన్నారు.

బీఆర్ఎస్‌లోనే ఉంటా : బీఎస్ కేశవ్

రాబోయే తరానికి కాబోయో ముఖ్యమంత్రి కేటీఆరే అని మునిసిపల్ మాజీ చైర్మన్ బీఎస్ కేశవ్ అన్నారు. నాడు కేటీఆర్ చెప్పినందుకు ఎమ్మెల్యేను గెలిపించామని, అదే కేటీఆర్ మాటతో ఎవరినైనా రాజకీయంగా బొందపట్టేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. చివరి శ్వాస వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానన్నారు.

చదవాలంటే చెత్త తీయాల్సిందే...!

» రోజూ హాస్టల్ విద్యార్థినుల పరిస్థితి

మానవపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల కేంద్రంలోని బీసీ బాలికల హాస్టల్ విద్యార్థిలు చదువు కొనసాగించాలంటే తమకు కేటాయించిన గదుల్లో చెత్తను తీసివేసుకోవాల్సిందే... ప్రతిరోజు ఈ సంఘటనలు జరుగుతున్న ఎవరూ పట్టించుకోవడం లేదు. రోజువారిగానే శనివారం విద్యార్థినులు చెత్తను బుట్టల్లో వేసుకుని పంచాయితీ ట్రాక్టర్ కోసం వేచి ఉండి దాంట్లో వేస్తున్నారు. చదువుకోసం ఇతర గ్రామాల నుంచి వచ్చిన విద్యార్థినులతో ఇలా పనులు చేయించడం తప్పు అని పంచాయతీ కార్మికులు సైతం చెప్పారు. కానీ అక్కడున్న సిబ్బంది తీరుమారడం లేదని తెలుస్తున్నది. హాస్టల్‌లో నలుగురు వర్కర్లు ఉండాలి కానీ ప్రస్తుతం ముగ్గురు మాత్రమే పనులు చేస్తున్నారు. ఒకరు రెగ్యులర్ ఉద్యోగి కొంత మేరకు డబ్బు ఇచ్చి పనులు చేయిస్తున్నది. హాస్టల్ సమస్యలపై అధికారులు కన్నెత్తి చూడకపోవడంతో పరిస్థితి ఇలా మారిందని అనుకుంటున్నారు.

సుంకేసుల డ్యాంకు పెరిగిన వరద

» ఎగువ నుంచి 66 వేల ఇన్‌ఫ్లో, 64 వేలు ఔట్‌ఫ్లో



సుంకేసుల డ్యాం నుంచి దిగువకు విడుదల అవుతున్న వరద నీరు

రాజోలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి వరద నీటి ప్రవాహం పెరిగింది. గత వారం రోజులుగా వరద ప్రవాహం తగ్గుతూ వస్తుండగా గురువారం నుంచి కురుస్తున్న భారీ వర్షానికి శనివారం సుంకేసులకు ఎగువ నుంచి 66 వేల క్యూసెక్కులు వరద పెరిగింది. సుంకేసుల జలాశయం నుంచి 14 గేట్ల ద్వారా 64 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సుంకేసుల డ్యాం నీటి సామర్థ్యం 292.00 కాగా, ప్రస్తుతం 291.70 మీటర్లుగా నమోదు కాగా, గరిష్ఠ నీటి నిల్వ 1.20 టీఎంసీలకు ప్రస్తుతం 1.11 టిఎంసీ నీటి నిల్వ ఉన్నట్లు డ్యాం జేఈ మహేంద్ర రెడ్డి తెలిపారు. అదేవిధంగా కర్నూలు కేసీ కెనాల్‌కు 2,100 క్యూసెక్కులు విడుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మరమ్మతులు చేపట్టరా?

» దుందుభి నదిలోని కాజ్‌వేను పట్టించుకోని పంచాయతీరాజ్ అధికారులు



వరద ప్రవాహంతో కోతకు గురై విరిగిపడిన సీసీ రోడ్డు

తాడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామంలో దుందుభీ నదిలో ఉన్న కాజ్‌వే ఇటీవల జరుగుతున్న వరద ప్రవా హాలతో పూర్తిగా దెబ్బతినింది. గత నెల 15రోజులు వరద ప్రవాహం కారణంగా రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా గత పది రోజులుగా దుందుభీ నదిలో వరద ప్రవాహం తగ్గింది. అయినప్పటికీ అధికారులు ఎవరూ స్పందించకపోవడంతో సిర్సవాడ నుంచి కల్వకుర్తి, ఊర్కొండ, మిడ్జిల్ మండలాల వైపు వెళ్లే వాహనదారులు, దుందుభీ నది అవతలి భాగంలో వ్యవసాయం చేసుకునే అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కాజ్‌వే పూర్తిగా దెబ్బతిన్నందున నది ప్రవాహం తగ్గడంతో కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టి రాకపోకలు కొ నసాగిస్తున్నారని అనుకున్న వాహనదారులకు, రైతులకు ఆడియాశనే మిగిలింది. ఈ సమస్యకు సంబంధించి సంబంధిత పంచాయతీరాజ్ అధికారులతో పాటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా తాత్కాలిక మరమ్మతులను ఎవరూ పట్టించుకోవడం లేదంటూ వాహనదారులు, రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దుందుభీ నది అవతలి భాగంలో వ్యవసాయం చేసుకునే రైతులకు ఎరువుల బస్తాలు, రైతు కూలీలను తరలించే క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పంచాయతీరాజ్, ప్రజాప్రతినిధులు స్పందించి దుందుభీ నదిలోని కాజ్‌వేపై తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని వాహ నదారులు, అన్నదాతలు కోరుతున్నారు. లేకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ గ్రామాల్లోని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వెల్దండ - సిర్సనగండ్ల రోడ్డుకు మహర్దశ

» ఆర్ అండ్ బీ ఈఎన్‌సీ మోహన్‌నాయక్



మోహన్‌నాయక్‌ను సన్మానించిన స్థానిక నాయకులు

వెల్దండ, సెప్టంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోడ్ల విస్తరణతోనే ప్రగతి ఆధారపడి ఉందని, వెల్దండ మండల కేంద్రం నుంచి సిర్సనగండ్ల రోడ్డు విస్తరణతో గ్రామాలకు మహర్దశ పట్టనుందని ఆర్ అండ్ బీ ఈఎన్‌సీ మోహన్‌నాయక్ అన్నారు. వెల్దండ నుంచి సిర్సనగండ్ల వరకు సుమారు 40 కోట్లతో చేపట్టే రోడ్డు విస్తరణ పనులను శనివారం మోహన్‌నాయక్ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజురోజుకు దినదినాభివృద్ధి చెందుతున్న వెల్దండ పట్టణంలో నాలుగులేన్ల రోడ్డు, సెంట్రల్ లైటింగ్ చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లో రోడ్డు విస్తరణలో భాగంగా తమ ఇళ్లు కోల్పోతే వారికి పరిహారం ఇవ్వాలని స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకుడు యెన్నం భూపతిరెడ్డి ఈ సందర్భంగా మోహన్‌నాయక్ దృష్టికి తెచ్చారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. రోడ్డు పనులకు అందరూ సహకరించాలని మోహన్‌నాయక్ కోరారు. ఆర్‌అండ్‌బీ మహబూబ్‌నగర్ ఎస్సీ రాజేందర్, ఈఈ దేశ్యనాయక్, కాంట్రాక్టర్ శివపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో 12 యూనిట్ల ద్వారా విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పతి కేంద్రాల ఎస్ఈ శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 4.501 మిలియన్ యూనిట్లను చేపట్టగా, ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు 320.992 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో ఆరు యూనిట్ల ద్వారా 4.323 మిలియన్ యూనిట్లను చేపట్టగా ప్రారంభించిన నాటి నుంచి ఇప్పటివరకు 346.579 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు ఆయన తెలిపారు. వరద ఇదే స్థాయిలో కొనసాగితే రికార్డు దిశగా విద్యుత్ ఉత్పత్తి చేపట్టే అవకాశం ఉందని తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

- మృతదేహంతో ఆటో డ్రైవర్ ఇంటి ముందు బంధువుల ఆందోళన
- రూ. 3.50 లక్షల ఒప్పందంతో అంత్యక్రియలు


చెన్నప్ప (ఫైల్)

దామరగిద్ద, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆటో అదుపు తప్పి బోల్తా పడి తీవ్ర గాయాలైన వ్యక్తి హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. వ్యక్తి మృతికి ఆటో డ్రైవర్ కారణమంటూ ఆటో డ్రైవర్ ఇంటి ముందు మృతదేహంతో భార్య, బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దామరగిద్ద మండల పరిధిలోని కందెన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు ఆటోలో బాపన్‌పల్లి గ్రామానికి పురుడు కార్యక్రమానికి ఈ నెల 3న వెళ్తుండగా ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న ముగ్గురు కె.చెన్నప్ప, లక్ష్మి, చెన్నప్పలకు తీవ్ర గాయాలు కాగా మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్ర గాయాలైన ముగ్గురిని అంబులెన్స్‌లో నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి నుంచి మహబూబ్‌నగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రికి తరలించారు. అందులో కె.చెన్నప్ప (55) పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందాడు. శుక్రవారం నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని తన గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఇంటి ముందు ఉంచారు. కొంతమంది నాయకులు, గ్రామస్థులు శనివారం పంచాయతీ నిర్వహించి రూ. 3.50 లక్షలు మృతుడి భార్య చింతమ్మకు ఇవ్వాలని ఒప్పించడంతో అంత్యక్రియలు పూర్తి చేశారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పి.రాజు తెలిపారు.

రైలు కిందపడి మహిళ ఆత్మహత్య

మహబూబ్‌నగర్/అలంపూరుచౌరస్తా, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి మహిళ ఆత్మహత్య చేసుకుంది. బోయపల్లి రైలు గేటు సమీపంలో శనివారం పట్టాలపై గుర్తు తెలియని మహిళ(48) ప్రమాదవశాత్తు రైలు కింద పడి చనిపోయింది. స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని జనరల్ ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. మృతురాలికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. జరిగిన ప్రమాదంపై రైల్వే ఎస్‌ఐ రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జోగుళాంబ రైల్వేహాల్ట్ సమీపంలో...

ఉండవల్లి మండల పరిధిలోని జోగుళాంబ రైల్వేహాల్ట్ సమీపంలో గుర్తుతెలియని వ్యకి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం తెల్లవారుజామున ఔరంగాబాద్ నుంచి గుంటూరు వైపు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు ముందు పడిపోయాడు. హారన్ కొట్టినా లేవలేదు. దీంతో అతడిపై నుంచి ట్రైన్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి వద్ద ఉన్న మొబైల్ ఆధారంగా వారి బంధువులకు సమాచారం ఇచ్చామని అధికారులు తెలిపారు. మృతుడిది వనపర్తి జిల్లా బుద్దారం గ్రామంగా తెలిసింది.

కారు సర్వీసింగ్‌కు వెళ్లి తిరిగిరాని యువకుడు

- కుటుంబంలో ఆందోళన


శివగౌడ్ (ఫైల్)

మిడ్జిల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్లపల్లి గ్రామానికి చెందిన పట్టపర్ల శివగౌడ్(35) శుక్రవారం అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ శివనాగేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం... శివగౌడ్ కారు డ్రైవరుగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య అనూష గృహిణి. ఈ నెల 5న దంపతులు వాడ్యాలలో బంధువు వరలక్ష్మి ఇంటికి కారులో వచ్చారు. 12న ఉదయం ఒంటిగంట ప్రాంతంలో కారు సర్వీసింగ్ చేయించుకుని వస్తానని చెప్పి వడ్యాల నుంచి కల్వకుర్తికి బయలుదేరాడు. అయితే అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి ఫోన్ చేసినప్పటికీ స్విచ్‌ఆఫ్ వచ్చింది. ఆ తర్వాత నుంచి అతను ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు అన్ని ప్రాంతాల్లో వెతికినా శివగౌడ్ ఆచూకీ లభించలేదు. దీంతో భార్య అనూష స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య


సురేష్ (ఫైల్)

రేవల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రేవల్లి మండలంలోని తలుపునూరు గ్రామానికి చెందిన మద్దిలేటి సురేష్ (35) మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రజిత తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 27న ఉదయం దాదాపు పది గంటల సమయంలో సురేష్ పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం నాగర్ కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తర లించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం 11 గంటలకు చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. సురేష్ భార్య మూడు సంవత్సరాల క్రితం పాము కాటు కు గురై మృతి చెందింది. భార్య మరణం అనంతరం తన ఇద్దరి కూతుళ్లతో పాటు జీవనం కొనసాగిస్తున్న సురేష్ తీవ్ర మనస్తాపానికి గురై పురుగుల మందు తాగినట్లు పోలీసులు తెలిపారు. సురేష్ అన్న శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తల్లిని గొంతు నులిమి చంపిన కొడుకు


దాసరి అలివేలు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్ర మునిసిపాలిటీ పరిధిలోని ఎండబెట్ల గ్రామానికి చెందిన దాసరి అలివేలు(50)ను కొడుకు శివ, కోడలు పద్మ గొంతు నులిమి హత్య చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. ఎండబెట్లకు చెందిన అలివేలు తన కొడుకు శివ జులాయిగా తిరుగుతున్నాడని మందలించింది. దీంతో ఆగ్రహించిన కొడుకు శివ అతని భార్య పద్మ శుక్రవారం రాత్రి తల్లి ఇంట్లో నిద్రించిన తర్వాత గొంతు నులిమి హత్య చేశారు. శనివారం ఉదయం తన అక్క ఓట్స్ మనెమ్మకు తల్లి చనిపోయిందని ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. దీంతో మనెమ్మ వచ్చి తన తల్లిని హత్య చేశారనే అనుమానంతో నాగర్‌కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యా దు చేసింది.

ఈ విషయం తెలుసుకున్న కొడుకు శివ, కోడలు పద్మలు పరారయ్యారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

విద్యుదాఘాతానికి పూరి గుడిసె దగ్ధం


దేవునితిర్మలాపూర్‌లో విద్యుదాఘాతానికి గురై దగ్ధమైన పూరి గుడిసె

పెద్దకొత్తపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలంలోని దేవునితిర్మలాపూర్ గ్రామంలో ఎరుకల నాగరాజు నివాసముంటున్న పూరి గుడిసెతోపాటు పందుల పాక శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తున విద్యుదాఘాతానికి గురై దగ్ధమయ్యాయి. అగ్నిప్రమాదం నుంచి పందులను కాపాడారు. ఈ అగ్ని ప్రమాదంలో రూ.30వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఎరుకల నాగరాజు తెలిపారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన నాగరాజు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి బొలెద్దుల శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు.

సబ్సిడీ.. సగంబలం!

● వ్యవసాయానికి యంత్రసాయం

- యంత్రాల కోసం దరఖాస్తుల ఆహ్వానం
- 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1.50 కోట్లతో పథకం ప్రారంభం
- ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీతో మంజూరు
- మిగతా రైతులకు 40 శాతం సబ్సిడీ



ఆత్మకూరు/కల్వకుర్తి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతుకు వెన్నుదన్నుగా నిలవాలని తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త తెచ్చింది. వ్యవసాయ యాంత్రీకరణ పేరుతో సబ్సిడీతో రైతులకు వ్యవసాయ యంత్రాలను అందజేసేందుకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వనపర్తి జిల్లా వ్యాప్తంగా 1.50 కోట్ల వ్యయంతో రైతులకు యంత్రాలను అందజేసేందుకు రంగం సిద్ధం చేసింది. ఇది వరకే జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులకు ఆదేశాలు జారీ చేసి దరఖాస్తుల ఆహ్వానం కోరుతోంది. అందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, సన్న, చిన్నకారు మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ, బడా రైతులకు 40 శాతం సబ్సిడీతో వ్యవసాయ యంత్రాలను అందజేసేందుకు దరఖాస్తులు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 2014లో కేసీఆర్ ప్రభుత్వం అధికారం చేపట్టి మొదటి నాలుగు సంవత్సరాల్లో వ్యవసాయ యంత్రాలను సబ్సిడీపై అందజేసేవారు. 2018 ఎన్నికల సమయంలో రైతులకు రైతుబంధు పేర ఎకరాకు 4000 రూపాయలను అందజేయడంతో సబ్సి డీని ఎత్తివేసింది. అప్పటి నుంచి రైతులు వ్యవ సాయ యంత్రాలను కొనుగోలు చేయలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. తెలంగాణలో కాంగ్రెస్ అధికారం చేపట్టక వ్యవసాయాన్ని పండుగలా మార్చేందుకు రైతు భరోసా, రైతు రుణమాఫీ, బోనస్‌తో పాటు సబ్సిడీపై వ్యవ సాయ యంత్రాలను కూడా అందజేసేందుకు రంగం సిద్ధం చేసింది.

అలాగే, కల్వకుర్తి డివిజన్ పరిధిలోని కల్వకుర్తి, వెల్దండ, చారకొండ, ఊర్కొండ మండలాలకు మొత్తం 308పనిముట్లు మంజూరయ్యాయి.

● గతంలో ఇచ్చేవారు



వ్యవసాయాన్ని పండుగ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ సబ్సిడీ యంత్రాలను ప్రవేశ పెట్టడం శుభపరిణామమే. గత వైఎస్సార్ హయాంలో రైతులకు వ్యవసాయ యంత్రాలను ఇచ్చేవారు. మళ్లీ ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసింది. ప్రస్తుతం ఇస్తున్న యంత్రాలతో పాటు రైతులకు సబ్సిడీపై వ్యవసాయ మోటార్లు అందజేస్తే రైతులకు మరింత లబ్ధి చేకూరే అవకాశం ఉంది.

● కుమార్, రైతు, జూరాల గ్రామం

● రైతులు సద్వినియోగం చేసుకోవాలి

రైతులకు లబ్ధి చేకూర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీ యంత్రాలకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా సబ్సిడీపై యంత్రాలను అందజేస్తుంది. రైతులు సంబంధిత ధ్రువపత్రాలతో వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలి. ఈ నెలాఖరులోగా దరఖాస్తులు పూర్తి చేసుకుంటే లబ్ధిదారుల ఎంపిక కూడా త్వరలో పూర్తి చేసి సబ్సిడీ యంత్రాలను అందజేసే అవకాశం ఉంది.

● వినయ్‌కుమార్ , మండల వ్యవసాయ అధికారి, ఆత్మకూరు

● వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు

వనపర్తి జిల్లా వ్యాప్తంగా 15 మండలాలు ఉన్నాయి. అందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు 9 రకాల వ్యవసాయ కంపెనీల డీలర్లతో చర్చించేందుకు రంగం సిద్ధం చేసింది.

- మాన్యువల్ పవర్ స్ప్రేర్ (162 వస్తువులు)
- బ్యాటరీ స్ప్రేర్ (603)
- రోటవేటర్ (35)
- స్వాప్ డ్రిల్ (11)
- కల్టివేటర్, క్రేజీ వీల్స్ కలుపుకుని (52)
- పవర్ వీలర్ (4)
- బ్రష్ కట్టర్ (11)
- పవర్ కట్టర్(8)


పవర్ స్ప్రే

వస్తువులు గల వీటిని సబ్సిడీపై ఇచ్చేందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ సిద్ధమైంది. అందులో భాగంగా యంత్రం ధరను ఆధారం చేసుకుని అందులో ఎంపికైన లబ్ధిదారునికి ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు 50 శాతం, మిగతా రైతులకు 40 శాతం డీడీ రూపంలో చెల్లించేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేయనున్నారు. ఇందుకు రైతులు తమ పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ అకౌంట్, కుల ధ్రు వీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో మండలంలోని వ్యవసా య కార్యాలయంలో సంప్రదించాల్సి ఉంటుంది.

ఎంపిక విధానం ఇలా...

సబ్సిడీ యంత్రాల కొరకు రైతులు ఈ నెలాఖరులోగా సంబంధిత ధ్రువపత్రాలతో దరఖాస్తులు చేసుకున్న అనంతరం ఎంపిక విధానం జరగనుంది. లక్షలోపు యూనిట్‌కు ఎంపికైన లబ్ధిదారులకు సంబంధిత అగ్రికల్చర్ డివిజన్ ఆఫీసర్, మండల వ్యవసాయ అధికారి, మండల పరిషత్ అధికారి ఆధ్వర్యంలో లబ్ధిదారులను గుర్తిస్తారు. అలాగే లక్ష పైగా ఎంపికైన లబ్దిదారుడి ఎంపిక విధానం కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి, ఆగ్రోస్ మేనేజర్స్ ఆధ్వర్యంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. గత ఆరు సంవత్సరాల నుంచి వ్యవసాయ సబ్సిడీ యంత్రాల కొరకు వేచి చూస్తున్న రైతులకు తెలంగాణ ప్రభుత్వం సబ్సిడీ వ్యవసాయ యంత్రాలను అందజేయడం శుభపరిణామమే అని చెప్పుకోవచ్చు. రైతులు ఈ నెలాఖరులోగా దరఖాస్తులు చేసుకుని సబ్సిడీ యంత్రాలను పొందాలని జిల్లా వ్యవసాయ అధికారులు కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి


లింగాలలో సమ్మెలో పాల్గొన్న దినసరి వేతన కూలీలు


కల్వకుర్తిలో సమ్మెలో పాల్గొన్న దినసరి వేతన కూలీలు

- దినసరి వేతన కూలీలు

లింగాల/ కల్వకుర్తి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాల, హాస్టళ్లల్లో దినసరి వేతనం కింద పని చేస్తున్న కూలీల సమస్యలను పరిష్కరించాలని పలువురు డిమాండ్ చేశారు. స్థానిక గిరిజన ఆశ్రమ ఎస్సీ హాస్టల్ గేటు ముందు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం రెండవ రోజు కొనసాగించారు. ఈ సందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ డైలీవైజ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని, మరణించిన వారి స్థానంలో కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం చాలీచాలనీ వేతనాలతో పెరిగిన నిత్యావసర ధరల నిమిత్తం కుటుంబ పోషణ బరువైందని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో డైలీవైజ్ వర్కర్లకు రూ.12,500 చెల్లించేవారని, ప్రస్తుతం రూ.11వేలకు తగ్గించారని ఆందోళన వ్యక్తం చేశారు. సీనియారిటీ పెరిగే కొద్దీ వేతనాలు పెంచాలే తప్పా తగ్గించడం ఏమిటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చాలీచాలని వేతనాలను కూడా గత ఐదు నెలలుగా చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారని ఆరోపించారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని డిమాండ్ చేశారు. శారద, షామీద్, శిల్పా, సుదాకర్, సావిత్రమ్మ, సరోజులు పాల్గొన్నారు.

● కల్వకుర్తి పట్టణంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ముందు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె శనివారం రెండవ రోజుకు చేరుకుంది. నిరవధిక సమ్మెలో కల్వకుర్తి డివిజన్ పరిధిలోని ఎస్సీ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో పని చేస్తున్న దినసరి వేతనం కూలీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ యూనియన్ సభ్యులు మబ్బు నర్సమ్మ, పద్మలు మాట్లాడారు. ప్రభుత్వం స్పందించి తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని పేర్కొన్నారు. వర్కర్స్ యూనియన్ సభ్యులు రవి, యాదమ్మ, సుక్కీ, బుజ్జి, నీలా, మారతి, సునీత, భాగ్యమ్మ, సునీత, అలివేల, ఖాజాబీ, బాలకిష్టమ్మ, రుక్మిణీ ఉన్నారు.

కోతుల నుంచి రక్షణ కల్పించాలి

- మద్దూరులో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాస్తారోకో


మద్దూర్‌లో రాస్తారోకో చేస్తున్న పట్టణ వాసులు

మద్దూర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కోతుల దాడుల నుంచి పట్టణ వాసులను రక్షణ కల్పించాలని కోరుతూ మద్దూర్‌లో శనివారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో రాస్తారోకో, ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా మండల నాయకులు మహ్మద్ అలీ, అశోక్‌లు మాట్లాడారు. గత 15 రోజుల నుంచి కోతులు దాడులు చేసి 10 మందిని తీవ్రంగా గాయ పర్చాయన్నారు. మొదటి రోజు నుంచి చెపుతూ వస్తున్నా ఏ అధికారి కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. ప్రతీ రోజు పట్టణ వాసులు ఇళ్ల నుంచి బయటకు వెళ్లాలన్నా భయపడే పరిస్థితి నెలకొందన్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా కోతులను ఊరి నుంచి అడవికి తరలించేందుకు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బాధితులు, నాయకులు భరత్, సుక్కప్పతో పాటు రాములు, అబ్దుల్లా, దస్తప్ప, వెంకటమ్మ, బాధిత కుటుంబ సభ్యులు, పట్టణ వాసులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష విఫలానికి సీఎం బాధ్యత వహించాలి

- బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ అతినారపు విష్ణు
- బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో సీఎం దిష్టిబొమ్మ దహనం


జిల్లా కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్‌వీ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 పరీక్ష నిర్వహణలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ విఫలమైనందుకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా కోఆర్డినేటర్ అతినారపు విష్ణు డిమాండ్ చేశారు. శనివారం బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నిరసన ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల పాలిట శాపంగా మారిందని, హైకోర్టు ఇచ్చిన తీర్పుకు అనుగుణంగా గ్రూప్-1 పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే జీవో నెంబరు 29ని రద్దు చేసి జీవో 55ను అమలు చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక పరీక్ష కేంద్రాల్లో అక్రమాలు జరిగాయని, నిరుద్యోగ అభ్యర్థులు ఆరోపిస్తున్న నేపథ్యంలో గ్రూప్-1కు తిరిగి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టింపులకు పోకుండా హైకోర్టు డివిజన్ బెంచ్, సుప్రీంకోర్టుకు వెళ్లి గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం చేయాలని కోరారు. బీఆర్‌ఎస్‌వీ నాయకులు జానకిరాం, పాలమూరు శివ, రమణ, వంశీగౌడ్, రవీందర్, అఖిల్‌గౌడ్, ప్రశాంత్, సైపుద్దీన్, శివ, బాలు, ప్రశాష్, భీమయ్య, ర వీందర్‌రెడ్డి, ఎండీ.గపూర్, బీఆర్‌ఎస్ నాయ కులు పర్వతాలు, లోకేష్, శ్యాం, శ్రీను పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించాలి

- జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు రాములు


జిల్లా యోగా క్రీడాకారులతో జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు రాములు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించాలని యోగా సంఘం మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు రాములు అన్నారు. ఆదివారం నల్గొండ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు జిల్లా క్రీడాకారులు తరలివెళ్లారు. శనివారం స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు రాములు మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని క్రీడాకారులకు బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు. జిల్లా క్రీడాకారులు యోగాలో జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా అథ్లెటిక్స్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, యోగా సంఘం ప్రధాన కార్యదర్శి బాలరాజు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కిషన్‌దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

మహిళ విభాగం: నందిని, కావేరీ, పూజ. శైలజ. స్వప్న, శ్వేత, బాలమణి

పురుషుల విభాగం: సాగర్, మధు, ఆకాష్, వెంకటేష్

నీళ్లొచ్చినా నిష్ఫలం

(5వ పేజీ తరువాయి)

నింపేవారు. ప్రస్తుతం స్థానికంగా కురిసిన వర్షాలకే చెరువులు నిండిపోతున్నాయి. దీంతో ఎత్తిపోతల పథకాలను రన్ చేసి నీటిని ఎక్కడ నిల్వ చేసుకోవాలో తెలియడం లేదు. రిజర్వాయర్ల సామర్థ్యం లేకపోగా ఉన్నవాటిలో పెండింగ్ సమస్యలతో ఫుల్ రిజర్వాయర్ నింపుకోలేకపోతున్నారు. నెట్టెంపాడు కింద కీలక రిజర్వాయర్ అయిన ర్యాలంపాడు సామర్థ్యం 4 టీఎంసీలు కాగా లీకేజీల కారణంగా ఐదేళ్లుగా 2 టీఎంసీలనే నింపుతున్నారు. భీమా 2 కింద శంకరసముద్రం రిజర్వాయర్ సా మర్థ్యం 1.81 టీఎంసీలు కాగా కేవలం ముంపు గ్రామాన్ని ఖాళీ చేయించలేక 0.760 టీఎంసీలనే నింపుతున్నారు. ఈ వాటర్ ఇయర్‌లో జూరాలకు 76 రోజుల పాటు వరద వచ్చింది.

భీమా లిఫ్టు -1 మోటార్లను కేవలం 41 రోజులపాటు నడిపి 2.60 టీఎంసీలను మాత్రమే ఎత్తిపోశారు. భీమా లిఫ్టు-2 మోటార్లను 52 రోజులపాటు నడిపి 3.3 టీఎంసీలను ఎత్తిపోశారు. భీమాకు 20 టీఎంసీల పైచిలుకు కేటాయింపుల ఉన్నాయి. ప్రతీఏటా 6 టీఎంసీల కంటే ఎక్కువ లిఫ్ట్ చేసుకోవడం లేదు. నెట్టెంపాడుకు 22 టీఎంసీల వరద జలాలను తరలించేందుకు డిజైన్ చేయగా కేవలం 8 టీఎంసీల వరకే లిఫ్టు చేస్తున్నారు. ఈ ఏడాది 4.393 టీఎంసీలను మాత్రమే ఇప్పటివరకు తరలించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి ఈ ఏడాది 64 రోజులకు గాను 49 రోజులను మాత్రమే పంపులు నడిపి 7 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేశారు. ఈ పథకం కింద 4 టీఎంసీల సామర్థ్యం మాత్రమే ఉండగా ప్రస్తుతం 3.20 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

షూటింగ్‌బాల్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపిక



రాష్ట్ర స్థాయికి ఎంపికైన టి.తిరుమలేష్, బి.గణేష్

మల్దకల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల పరిధిలోని ఎల్కూర్ గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులు రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికయ్యారు. ఎల్కూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ఈనెల 12వ తేదీన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియంలో అండర్ జూనియర్ బాల బాలికల సెలెక్షన్ నిర్వహించారు. అందులో భాగంగా తిరుమలేష్, గణేశ్‌లు మంచి ప్రదర్శన చేసి రాష్ట్రస్థాయి కు ఎంపికైనట్లు పాఠశాల పీడీ రజినీకాంత్ తెలిపారు.

ఇంటర్వ్యూ..

పారిశుధ్యం లోపించకుండా చర్యలు

» ఎంపీడీవో ఆనంద్



కోయిలకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా చర్యలు చేపడుతున్నామని ఎంపీడీవో ఆనంద్ పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు వివరాలు వెల్లడించారు.

పారిశుధ్య నివారణకు చేపట్టిన చర్యలు ఏమిటి?

మండలంలో విరివిగా వర్షాలు కురియడంతో పారిశుధ్య నివారణకు సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నాం. ప్రతీ రోజు గ్రామాల వారీగా కార్యదర్శుల నుంచి ఫొటోలతో వివరాలు తెప్పించుకుంటున్నాం.

బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్నారా?

మురుగు నీరు నిలిచిన చోట, మురుగు కాలువలపై బ్లీచింగ్ పౌడర్‌తో పాటు సున్నం చల్లించాలని కార్యదర్శులను ఆదేశించాం. దోమలు వ్యాప్తి చెందకుండా ముందస్తు చర్యలు చేపట్టాం.

సమావేశాలు నిర్వహిస్తున్నారా?

ప్రతీ బుధవారం మండల కార్యాలయంలో కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్షా సమావేశాలు నిర్వహించి, గ్రామాల్లో పనుల వివరాలను సేకరిస్తున్నాం.

తాగునీటి ట్యాంకులు శుభ్రం చేస్తున్నారా?

గ్రామాల్లో తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించాం. అంటు వ్యాధులపై కొతలాబాద్, మణికొండ, కోయిలకొండ వైద్యాధికారులతో సమావేశాలు నిర్వహిస్తున్నాం.

న్యూస్ బాక్స్

నేడు జిల్లా నెట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : వచ్చే నెలలో నిర్వహించే 8వ రాష్ట్ర స్థాయి జూనియర్, సీనియర్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపికలను ఆదివారం స్టేడియం మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు విక్రమ్ ఆదిత్యరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ కేటగిరీ విభాగంలో మార్చి 31, 2007 తర్వాత జన్మించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు కోచ్ అంజద్‌అలీకి రిపోర్టు చేయాలని కోరారు.

కబడ్డీ జట్ల ఎంపికలు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిజామాబాద్ జిల్లా ముక్పాల్‌లో ఈనెల 25 నుంచి 28 వరకు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ కబడ్డీ టోర్నీ నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో పాల్గొనే జిల్లా బాల, బాలికల జట్ల ఎంపికలను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. 31-11-2009 తరువాత పుట్టినవారై 16 సంవత్సరాలలోపు 55 కిలోల బరువు ఉన్న వారు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు మధ్యాహ్నం 2 గంటలకు బర్త్, ఒరిజనల్ ఆధార్ రిపోర్టు చేయాలని కోరారు.

రేపు వీరభద్ర స్వామి నందికోల సేవ

మహబూబ్‌నగర్ రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మణ్యంకొండ లక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలోని వీరభద్ర స్వామి ఆలయంలో సోమవారం రాత్రి నందికోల సేవ, వీరభద్ర సేవ, 16న ఉదయం 5 గంటలకు అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త మధుసూదన్ కుమార్, ఈవో శ్రీనివాస్‌రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో దోస్త్ ద్వారా ఈనెల 15, 16వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ డా.రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని ఆ వివరాలను కళాశాలలో అందజేయాలన్నారు. 17న ఎంపికైన అభ్యర్థుల ఫోన్‌కు సీట్ల వివరాలు సమాచారం వస్తుందన్నారు.

ఆలయాభివృద్ధికి దాతలు ముందుకు రావాలి

మూసాపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మూసాపేట రామస్వామి గుట్టలో వెలిసిన పురాతన రామలింగేశ్వర స్వామి పునర్నిర్మాణంలో దాతలు ముందుకు రావాలని ఆలయ కమిటీ అధ్యక్షుడు అప్పని నరేందర్‌సాగర్ కోరారు. రెండో శనివారం సందర్భంగా భక్తులు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. దాతల ఆర్థిక సహకారంతో కోనేరు వద్ద నుంచి గుట్టపైకి ఎక్కడానికి ఉన్న రాతి మెట్లను నవీకరించాలని, అసంపూర్తిగా ఉన్న సీసీరోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, సన్నిధాన భవనాన్ని విజయ దశమి రోజు ప్రారంభించాలని, ఆలయంలో విగ్రహాలను పునఃప్రతిష్ఠించాలని నిర్ణయించారు. సమా వేశంలో ఆలూరి గోవర్ధన్, అశోక్‌రెడ్డి, యు గంధర్‌రెడ్డి, గోవిందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కల్పనే లక్ష్యం

» దుస్తుల తయారీపై మహిళలకు శిక్షణ



దుస్తుల తయారీని పరిశీలిస్తున్న నాబార్డ్ అధికారులు

కోయిలకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : స్వయం ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వంతో పాటు నాబార్డ్ సంస్థ నిర్వహిస్తున్న రెడీమెడ్ దుస్తుల తయారీపై శిక్షణ మహిళలకు ఎంతో ఉపయోగపడుతోంది. మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో నాబార్డ్ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల నుంచి 30 మహిళలను ఎంపిక చేసి శిక్షణ అందిస్తున్నారు. ఈ శిక్షణలో క్లాత్‌ను కట్‌చేసే విధానంతో పాటు దుస్తుల తయారీపై శిక్షణ అందించారు. 15 రోజుల పాటు శిక్షణకు వచ్చే మహిళలకు భోజనం తోపాటు రూ.50 అందించి శిక్షణ అందిస్తు న్నారు. 15 రోజుల్లో శిక్షణకు వచ్చిన మహిళలు రెడీమెడ్ దుస్తులను పూర్తి స్థాయిలో నేర్చుకోవడం జరిగిందని ఐకేపీ అధికారులు తెలిపారు. విడతల వారీగా మరికొంత మంది మహిళలకు కుట్టు అల్లికలు, ఎంబ్రాడరీపై శిక్షణ అందించాలని మహిళా సంఘాల మహిళలు కోరుతున్నారు.

దుస్తుల తయారీ నేర్చుకున్న..



ఐకేపీ కార్యాలయంలో ఐకేపీ, నాబార్డ్ ఆధ్వర్యంలో నిర్మిహించిన దుస్తుల తయారీ శిక్షణ మాకు ఎంతో ఉపయోగపడింది. ఇదే విధంగా మహిళలకు మరిన్ని పరికరాల తయారీపై శిక్షణ అందించాలి.

- మహేశ్వరి, నల్లవల్లి

శిక్షణ ఉపయోగపడుతుంది..



దుస్తుల తయారీపై అందించిన శిక్షణ మహిళా సంఘాలకు ఎంతో ఉపయోగపడుతుంది. 15 రోజుల్లో దుస్తుల తయారీ కోసం కట్టింగ్‌తో పాటు కుట్టు విషయాలను నేర్చుకున్నాం. దీంతో మాకు ఉపాధి దొరుకుతుంది.

- కృష్ణవేణి, ఆచార్యపూర్

మరో రెండు విడతలు శిక్షణ ఇవ్వాలి..



మండలంలో మహిళా సంఘాలకు నిర్వహిస్తున్న రెడీమెడ్ దుస్తుల తయారీ శిక్షణ మరో రెండు విడతలు అందించాలి. మొదటి విడతలో 30 మంది మహిళలు మాత్రమే శిక్షణ పొందారు. దీంతో పాటు ఎంబ్రాయిడరి, అల్లికలపై శిక్షణ అందించాలి.

- చంద్రకళ, మండల మహిళ సంఘం అధ్యక్షురాలు

ప్రైవేట్ టీచర్ల వెల్ఫేర్ ఫండ్‌కు రూ.పది లక్షల విరాళం

» 'పది'లో వంద శాతం ఫలితాలు సాధించాలి

» గురుపూజోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేట్ పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు వెల్ఫేర్ ఫండ్ ఏర్పాటు చేసుకోవాలని, అందుకు యాజమాన్యాలు, టీచర్లు కలసి ప్రతీ నెల రూ.500 జమ చేసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా ట్రస్మా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమానికి ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 300మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో 65 శాతం మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, అందుకు ప్రైవేట్ విద్యా సంస్థలను కాపాడుకోవల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుల వెల్ఫేర్ ఫండ్‌కు తన వంతుగా రూ.10 లక్షల విరాళం ప్రకటించారు. ఆరోగ్యబీమా కోసం ప్రతీ ప్రైవేట్ ఉపాధ్యాయుడు తమవంతుగా రూ.250 చెల్లించాలని, దీనికి తోడు పాఠశాల యాజమాన్యం కూడా రూ.250 చెల్లిస్తాయని తెలిపారు. పదో తరగతిలో జిల్లాలో వందశాతం ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, రిషి విద్యాసంస్థల ముఖ్య సలహాదారు వెంకటయ్య, వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ విజేత వెంకట్‌రెడ్డి, ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, నాయకుడు క్రాంతికుమార్, పట్టణ అధ్యక్షుడు వంశీమోహన్‌రెడ్డి, రిషి విద్యాసంస్థల చైర్మన్ చంద్రకళావెంకటయ్య, లక్ష్మణ్‌గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ప్రతిష్ఠను పెంచాలి

మీరంతా కష్టపడి చదివి పాలమూరు ట్రిపుల్ ఐటీ ప్రతిష్ఠను పెంచాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ట్రిపుల్ ఐటీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు? పదో తరగతిలో ఎన్ని మార్కులు వచ్చాయి? హాస్టల్ భోజనం ఎలా ఉందని తెలుసుకున్నారు. ట్రిపుల్ ఐటీ ప్రిన్సిపాల్ శ్రవన్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, నాయకులు రఘు, యాదిరెడ్డి, రెడ్డి సేవా సంఘం సభ్యులు సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, బాలికలంతా బుద్ధిగా చదువుకోవాలని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఎస్సీ బాలికల వసతి గృహం-సీలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశానికి పాల్గొని, మాట్లాడారు. గ్రామీణ ప్రాంత నేపథ్యం ఉన్న విద్యార్థులు ఉన్నత చదువులకై వసతి గృహాల్లో ఉంటూ చదువుతు న్నారని, ఇందుకు ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు కృషి అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమ శాఖ అదనపు డీడీ సుదర్శన్, వసతి గృహం సంక్షేమాధికారి స్వప్నప్రియ, షీటీం సీఐ శ్రీనివాసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజల భద్రత పోలీసుల బాధ్యత

మహబూబ్‌నగర్ న్యూటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భద్రత పోలీసుల బాధ్యత అని డీఎస్పీ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎంవీఎస్ కాలేజీ ఉమెన్స్ హాస్టల్‌లో సామాజిక అవగాహన కార్యక్రమాన్ని సురక్ష పోలీస్ కళాబృందం - షీటీం, (ఏహెచ్‌టీయూ) మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సంయుక్తంగా నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నతమైన విలువలతో జీవతం గడపాలని కోరారు. సైబర్ క్రైమ్‌పై అప్రమత్తంగా ఉండాలని, ఎవరైన సైబర్ క్రైం బారిన పడితే 1930కి కాల్ చేయాలన్నారు. మత్తు పదార్థాలు జీవితాలను నాశనం చేస్తాయని, వాటికి దూరంగా ఉండాలన్నారు. మహిళా పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ అవసరాలకు, జీవిత ఉన్నత లక్ష్యాల కోసం వాడుకోవాలన్నారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమాచారం అందించాలన్నారు. సురక్ష పోలీస్ కళాబృందం సభ్యులు పాటలు పాడి విద్యార్థులకు వినిపించారు. సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సుదర్శన్, హాస్టల్ వార్డెన్ స్వప్నప్రియ పాల్గొన్నారు.

ఆయకట్టుకు నీటి విడుదల

దేవరకద్ర, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కోయిల్‌సాగర్ ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 32.5 అడుగులు కాగా, శనివారం సాయంత్రం నాటికి 32 అడుగులకు చేరింది. ప్రాజెక్టు నుంచి కుడి, ఎడమ కాల్వ ద్వారా ఆయకట్టు రైతులు సాగు చేసుకున్న పంటలకు నీటి విడుదల కొనసాగుతుందని ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు.

జడ్చర్లలో కేటీఆర్‌కు ఘన స్వాగతం

జడ్చర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు శనివారం జడ్చర్లలో ఘనంగా స్వాగతం పలికారు. జోగులాంబ గద్వాల జిల్లాలో నిర్వహిస్తున్న బహిరంగ సభకు వెళ్తున్న కేటీఆర్‌కు జడ్చర్ల పట్టణంలోని క్రాస్‌రోడ్డు వద్ద బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు.

రేపు గోపాష్టమి, గోపూజ

జడ్చర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం సత్యనారాయణస్వామి ఆలయంలో, మండలంలోని పరశవేదీశ్వరస్వామి ఆలయంలో గోపాష్టమి, గోపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ సభ్యురాలు లావణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు గోపాష్టమి, గోపూజ అనంతరం రుద్రాభిషేకం నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి భక్తులు, హిందూ బంధువులు హాజరుకావాలని కోరారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ ప్రారంభం

గండీడ్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి ఉమ్మడి గండీడ్ మండలంలో సామాజిక తనిఖీ ప్రారంభమవుతోందని ఎంపీడీవో హరిచంద్రారెడ్డి, ఏపీవో హరిశ్చంద్రుడు పేర్కొన్నారు. నాలుగు దశలలో తనిఖీ నిర్వహిస్తారని, మొదటి దశలో భాగంగా జంగంరెడ్డిపల్లి, వెంకట్‌రెడ్డిపల్లి, గాధిర్యాల్, చిన్నవార్వాల్, దేశాయిపల్లి, కొమిరెడ్డిపల్లి, చిన్నాయిపల్లి, అంచన్‌పల్లి, కొండాపూర్, వెన్నచేడ్, రుసుంపల్లి, గండీడ్, నంచర్ల, సల్కర్‌పేట్, అన్నారెడ్డిపల్లి గ్రామాల్లో సామాజిక తనిఖీ బృందం పనిచేసిన కూలీల వివరాలు సేకరిస్తారని తెలిపారు. కూలీలకు ఎలాంటి సమస్యలున్నా డీఆర్పీల దృష్టికి తీసుకురావాలన్నారు.

లక్ష్మీదేవమ్మ జీవితం ఆదర్శమైంది

పాలమూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : అందరి బంధువుగా జీవించిన లక్ష్మీదేవమ్మ జీవితం ఆదర్శవంతమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో లక్ష్మీదేవమ్మ ప్రథమ వర్ధంతిలో నాయకులు ఆర్.రాంరెడ్డి, కిల్లె గోపాల్‌తో కలిసి ఆయన పాల్గొని, మాట్లాడారు. తోటి కార్యకర్తల వ్యక్తిగత ఇబ్బందులు, మనోభావాలను అర్థం చేసుకుంటూ వారికి అండగా నిలబడి ఆత్మస్థైర్యం ఇవ్వడం లక్ష్మీదేవమ్మ గొప్పతనం అన్నారు. ఆమె భర్త ఎన్.బీ శ్రీహరి కూడా పార్టీలో పనిచేసి జైలు జీవితం గడిపారన్నారు. నల్లవెల్లి కురుమూర్తి, బి.చంద్రకాంత్, రాజ్‌కుమార్, కురుమూర్తి పాల్గొన్నారు.

అంతా మా ఇష్టం

» జోరుగా ఇసుక అక్రమ రవాణా

» మామూళ్ల మత్తులో అధికారులు, పోలీసులు



నిల్వ చేసిన కృత్రిమ ఇసుక (ఫైల్)

రాజాపూర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అక్రమ ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. ఎలాంటి అనుమతులు లేకపోయినా.. ఇసుక అక్రమార్కులు అంతా మా ఇష్టం అంటూ దుందుభీ వాగును కొల్లగొడుతూ రూ.లక్షల్లో ఆర్జిస్తున్నారు. మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీ సమీపంలోని దుందుభీ వాగులో, రాయపల్లి, చెన్నవెళ్లి, ముదిరెడ్డిపల్లి గ్రామాల్లో ప్రతీ రోజు 30 నుంచి 40 టిప్పర్లతో హైదరాబాద్, జడ్చర్ల పట్టణం, పోలేపల్లి సెజ్‌లకు ఇసుకను తరలిస్తున్నా అటు మైనింగ్, ఇటు రెవెన్యూ, పోలీసు అధికారులు మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ గ్రామంలో రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని సీజ్ చేసిన మట్టి కుప్పను సైతం కృత్రిమ ఇసుక తయారు చేస్తున్నారంటూ ఆరోపణలు ఉన్నాయి. వారిపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల రైతులు, ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, మండలంలో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని వాపోతున్నారు.

జరిమానా విధిస్తున్నాం..

అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వారిపై తమ సిబ్బంది ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నాం. వాల్టా చట్టానికి పాల్పడుతున్న వారిపై కఠినంగా వ్యవహరించడంతో ఆపటు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానా విధిస్తున్నాం.

- రాధాకృష్ణ, తహసీల్దార్

దళితులు, ముస్లింల మధ్య చిచ్చు పెట్టొద్దు



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య

హన్వాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళా భవనం ప్రాంగణంలో ఉర్దూఘర్ నిర్మించాలని మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఓబెదుల్లా కొత్వాల్ ప్రయత్నం చేస్తున్నారని, ఇది ముస్లిం, దళితుల మధ్య చిచ్చు పెట్టడమే అని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళా భవనం పరిరక్షణ కమిటీ (జేఏసీ) ఉమ్మడి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పరిరక్షణ సమితి చైర్మన్ సింగిరెడ్డి పరమేశ్వర్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య మాట్లాడుతూ ఉర్దూఘర్ భవనాన్ని నిర్మించి మతపరమైన కార్యక్రమాలు నిర్వహించేందుకు చైర్మన్ కుట్ర చేస్తున్నారని ఇది తగదన్నారు. రాజ్యాంగ నిర్మాత పేరుతో ఉన్న భవనాన్ని కాపాడుకుంటామని హెచ్చరించారు. మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ కొత్వాల్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. పరిరక్షణ సమితి, జేఏసీ నాయకులు రమేష్, నరేందర్, శ్రీవల్లి, రామ్, బాలకృష్ణయ్య, సిద్ధు, చంద్రకిరణ్, యాదయ్య పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పాలమూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో తెలంగాణ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా 4వ మహాసభలను ఆకుల వెంకటేష్, ప్రభాకర్, ఇంద్రమ్మ అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మునిసిపల్ కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతూ, పట్టణాన్ని పరిశుభ్రం చేస్తున్నారని తెలిపారు. వెట్టిచాకిరి చేస్తున్న కార్మికులను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెనిఫెస్టోలో చెప్పినట్లు మునిసిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. నల్లవెల్లి కురుమూర్తి, కిల్లె గోపాల్ మాట్లాడుతూ కార్మికులను అన్యాయం చేసే ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవన్నారు. సభలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల వెంకటేష్, ఎర్రం నరసింహులు, కదిరె బాలరాజు, జిల్లా నాయకులు ఖమర్‌అలీ, వెంకటేష్‌గౌడ్, చిన్నకృష్ణ, అంజమ్మ, యాదమ్మ, శంకర్, తిరుపతయ్య, కేశవులు, చంద్రకాంత్, రాజ్, .కురుమూర్తి పాల్గొన్నారు.

కమ్యూనిస్టులే సాయుధ రైతాంగ వారసులు

» సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ

పాలమూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టులే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసులని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాలనరసింహ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో 77వ తెలంగాణ సాయుధ పోరాట వార్షికోత్సవాలను జిల్లా కార్యదర్శి బాలకిషన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ వచ్చి 13 ఏళ్లు అవుతున్నా నేటికీ సెప్టెంబరు 17ను తెలంగాణ విమోచన దినాన్ని ఎందుకు అధికారికంగా నిర్వహించటం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వమే ఆ రోజును అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. సభలో పరమేష్‌గౌడ్, రాము, పద్మావతి, కృష్ణ, నరేందర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, మహష్రష్, చాంద్‌పాషా, ఆంజనేయులు, సుందర్‌రాజు, ప్రజాసంఘాల నాయకులు ఇందిరమ్మ, మాధవి, అంజనమ్మ, మంజుల పాల్గొన్నారు.

24న సీల్డ్ కవర్ టెండర్లు

చిన్నచింతకుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలో అమ్మాపూర్ గ్రామ సమీపంలోని కురుమూర్తి స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు దీపావళి అమావాస్య నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో బ్రహ్మోత్సవాలకు గాను సీల్డ్ కవర్ కొటేషన్స్, ఫ్లవర్ డెకరేషన్, ఆలయాలకు రంగులు వేయుట, చలువ పందిళ్లు, ప్రింటింగ్ మెటీరియల్స్, టెంటు, పూజా సామగ్రి, సీసీ కెమెరాలు ఏర్పాటుకు గాను ఈనెల 24న సీల్డ్ కవర్ టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈవో మదనేశ్వర్‌రెడ్డి శనివారం తెలిపారు. ఈ సీల్డ్ కవర్ టెండర్లను ఉదయం 11 గంటలకు ఓపెన్ చేయబడతాయని తెలిపారు. ఆసక్తి ఉన్న టెండర్ దారులు ఈనెల 24వ తేదీన 10 గంటలలోపు దేవస్థాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్స్‌లో వేయాలన్నారు. సీల్డ్ కవర్ టెండర్‌లో పాల్గొనే వారు ఈనెల 15న దేవస్థాన కార్యాలయంలో రూ.300 చెల్లించి టెండర్ షెడ్యూల్ ఫారం పొందాలని సూచించారు.

గిరిజన హాస్టల్ కార్మికుల వేతనాలు పెంచాలి



హాస్టల్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

పాలమూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : గిరిజన హాస్టల్స్‌లో పనిచేసే కార్మికులకు వేతనాలు తక్షణమే పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కార్మికులు చేస్తున్న దీక్షలు రెండో రోజుకు చేరుకున్నాయి. సమ్మెలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, కాంటినిజెంట్ వర్కర్స్ యూనియన్ (జేఏసీ) ఆధ్వర్యంలో కార్మికులు చేస్తున్న నిరవధిక దీక్షకు సీఐటీయూ మద్దతిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు చేస్తున్న సమ్మె న్యాయమైంది, ఎంతోకాలం నుంచి పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని, టైం స్కేల్ చేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ, వారాంతపు సెలవులు, జాతీయ సెలవులు, దసరా, సంక్రాంతి, వేసవి సెలవులు, మిగతా హాస్టల్స్ వర్కర్స్ ఇస్తున్నట్లు ఇవ్వాలన్నారు. సమ్మెలో అనసూయ, లక్ష్మి, జ్యోతి, రుక్మిణి, స్వరూప, అనిత, భీమమ్మ, శ్రీలత, గణేష్, ఎల్లప్ప, అంజమ్మ, పద్మ ఉన్నారు.

రూ.2.50 లక్షల ఎల్‌వోసీ అందజేత

హన్వాడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన హన్వాడకు చెందిన దాసరి లక్ష్మమ్మ అనారోగ్యంతో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుంది. చికిత్స నిమిత్తం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.2,50 లక్షల ఎల్‌వోసీని శనివారం తండ్రి పెంటయ్యకు అందజేశారు. అదే విధంగా మండలంలోని మాధారం గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త బసిరెడ్డి భార్య అమృత పది రోజుల క్రితం చెందగా, శనివారం గ్రామంలో నిర్వహించిన దశదిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు టంకర కృష్ణయ్య, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, మండల కోఆర్డినేటర్ వెంకటయ్య, దాసరి వెంకటయ్య, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం



విద్యార్థినులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పాలమూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎస్సీ కాలేజ్ బాలికల హాస్టల్(బి) విద్యార్థినులకు శనివారం కేవీపీఎస్ ఆధ్వర్యంలో హెల్త్‌క్యాంపు నిర్వహించారు. అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ (ఏఎస్‌డబ్ల్యూవో) సుదర్శన్ ప్రారంభించి, మాట్లాడారు. వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. డాక్టర్ దిగ్విజయ్, డాక్టర్ సమత, డాక్టర్ అంజని విద్యార్థులను పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేసి, సూచనలు చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుర్మయ్య, జిల్లా అధ్యక్షుడు మాణిక్యం రాజు, హెచ్‌డబ్ల్యూవో మధులత, హాస్టల్ సిబ్బంది అంజమ్మ, సుమలత పాల్గొన్నారు.